


RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

బుధవారం, 31 డిసెంబర్ 2025 మెదక్ పేజీలు :4 వెల రూ.:2 ఎడిటర్: సిహెచ్. శివకుమార్ సంపుటి 03 సంచిక 53

## అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను

# ప్రకటించిన కేసీఆర్

**హైదరాబాద్, డిసెంబరు 30 :** తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేస్తాయి. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారిని బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారిని కొనసాగించడం ద్వారా పార్టీ నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది.కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో



సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. సభ్యులు, పార్టీ నేతలు ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలు గుతారని తెలిపారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరి స్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. పార్టీలో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత ప్రాముఖ్యత పొందుతాయని బీఆర్ఎస్ నేతలు చెప్పుకొచ్చారు.

## ఎన్నికల్లో లబ్ధికి బంగ్లాదేశీయుల

### చొరబాట్లకు మమత సహకరిస్తున్నారు

**బంగాల్:** బంగాల్‌లో మూడింట రెండొంతుల మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా అన్నారు. బంగాల్ ప్రజలు టీఎంసీ సహా కాంగ్రెస్ లెఫ్ట్ పార్టీలకు బంగాల్ ప్రజలు అవకాశం ఇచ్చారని, ఈసారి బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కోల్?కతాలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న అమిత్? షా ఈ మేరకు వ్యాఖ్యలు



చేశారు."2014 ఎన్నికల్లో మాకు 17శాతం ఓట్లు, రెండు సీట్లు వచ్చాయి. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో మాకు 10శాతం ఓట్లు, కేవలం మూడు అసెంబ్లీ స్థానాల్లో గెలిచాం. అదే 2019 లోక్?సభ ఎన్నికలకు వచ్చేసరికి మాకు 41శాతం ఓట్లు, 18 సీట్లు వచ్చాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 38శాతం ఓట్లతో 77 స్థానాల్లో గెలిచాం. ఇది చాలా ఎక్కువ తేడా. కేవలం మూడు స్థానాలు గెలిచిన పార్టీ ఐదేళ్లలో ఏకంగా 77 సీట్లలో విజయం సాధించింది. కాంగ్రెస్? పుట్టిన బంగాల?లోనే ఆ పార్టీని జీరోకు తీసుకువచ్చాం. 34 ఏళ్ల పాటు పాలించిన కమ్యూనిస్ట్? కూటమి కనీసం ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. మేము ప్రధాన ప్రతిపక్షంగా అవతరించాం. ఇక 2026 ఎన్నికల్లో తప్పకుండా బీజేపీ భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది."' అమిత్ షా, కేంద్ర హోంమంత్రి రాజకీయ హింసలో వామపక్షాలను టీఎంసీ మించిపోయిందని అమిత్ షా ఆరోపించారు. బంగాల్ ఆర్థిక వ్యవస్థ క్షీణించిందని, పరిశ్రమలు రాష్ట్రాన్ని వదిలివెళు తున్నాయని విమర్శించారు. "ఎన్నికల సమయంలో బాబ్రీ మసీద్?ను నిర్మించడం సరైందో కాదో బంగాల్? ప్రజలు ఒకసారి ఆలోచించుకోవాలి. నిరుద్యోగం, అవినీతి, మహిళ భద్రత లాంటి ఎన్నో సమస్యలు రాష్ట్రంలో ఉన్నాయి. వీటన్నింటి నుంచి టీఎంసీ తప్పించుకునేందుకు అవకాశం లేదు. ఈశాన్య సరిహద్దుల నుంచి వస్తున్న ఆక్రమణదారులను బీజేపీ అడ్డుకుంటుంది.

## అధికారులు స్మార్ట్ గవర్నెన్స్‌కు

### మారాలి సీఎం రేవంత్ దిశానిర్దేశం

**హైదరాబాద్, డిసెంబరు 30 :** జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానించారు. ఇవాళ(మంగళవారం) కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని చెప్పుకొచ్చారు.పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని స్పష్టం చేశారు. సిటీలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని మార్గనిర్దేశం చేశారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ వాహనాలను తీసుకురావాలని నిర్ణయించామని తెలిపారు. సిటీలో



కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి.చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి.

### మేడారం జాతరకు సిద్ధమైన ఆర్టీసీ

## భారీగా ప్రత్యేక బస్సులు

**మేడారం:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు వెళ్లే భక్తుల కోసం టీజీఎస్ ఆర్టీసీ భారీ ఏర్పాట్లు చేసింది. జాతర సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ డిపోల నుంచి వందలాది బస్సులను మేడారానికి నడపాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రత్యేక బస్సుల కేటాయింపులో కొత్తగూడెం డిపో ముందంజలో ఉంది. ఇక్కడి నుండి అత్యధికంగా 110 బస్సులను నడపనున్నారు. అలాగే ఇల్లెందు నుంచి 41, భద్రాచలం నుండి 21, పాల్వంచ నుండి 15, ఖమ్మం నగరం నుంచి 10 బస్సులను భక్తుల కోసం సిద్ధం చేశారు. జాతరకు వెళ్లే భక్తులకు ఎక్కడా రవాణా ఇబ్బందులు కలగకుండా ఈ రూట్లలో బస్సు సర్వీసులను పక్కాగా ప్లాన్ చేశారు.కేవలం ప్రధాన పట్టణాలే కాకుండా, ఏజెన్సీ ప్రాంతాల నుండి కూడా బస్సులను ఏర్పాటు చేశారు. ఏటూరునాగారం నుంచి 17, మణుగూరు నుంచి 16, వెంకటాపురం నుంచి 6, మంగ పేట నుంచి 5 బస్సులను నడపనున్నారు. భక్తుల రద్దీని బట్టి అవసరమైతే మరిన్ని బస్సులను పెంచేందుకు కూడా అధికారులు సిద్ధంగా ఉన్నారు.

## టోల్ ఫ్రీ ప్రయాణానికి సన్నాహాలు

### - కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి లేఖ

**హైదరాబాద్, డిసెంబర్ 30:** తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద పండుగైన సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే లక్షలాది మంది ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం గొప్ప ఊరటనిచ్చేందుకు సిద్ధమైంది. పండుగ రద్దీ కారణంగా హైవేలపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి, ప్రయాణికులు ఎదుర్కొనే నరకయాతనకు చెక్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారితో పాటు





రాష్ట్రంలోని ప్రధాన మార్గాల్లో టోల్ ఫ్రీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా విన్నవించింది.రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ విషయమై కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ప్రత్యేకంగా లేఖ రాశారు. జనవరి 9 నుంచి 14వ తేదీ వరకు మొత్తం ఆరు రోజుల పాటు టోల్ వసూళ్లను నిలిపివేయాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. పండుగ వేళ హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు, అలాగే రాష్ట్రంలోని కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య లక్షల్లో ఉంటుందని, టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆపడం వల్ల ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉందని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

## మేం నిద్రలేపాకే

### ప్రభుత్వం స్పందించింది


**హైదరాబాద్, డిసెంబరు 30 :** తెలంగాణ జల ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనుసన్నల్లోనే రేవంత్ రెడ్డి పాలన సాగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ప్రతిపక్షంగా తాము గొంతు ఎత్తే వరకు ప్రభుత్వం




మొద్దునిద్రలో ఉందని, ఇప్పుడు అదే ప్రాజెక్టు పేరు మార్చుకుని 'నల్లమల సాగర్' రూపంలో తెలంగాణకు ముప్పుగా పరిణమించిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వాన్ని నిద్రలేపింది మేమే!గోదావరి–బనకచర్ల అనుసంధానంపై ప్రభుత్వం స్పందించేలా చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని హరీష్ రావు స్పష్టం చేశారు. తాము ఈ అంశాన్ని బయటపెట్టిన తర్వాతే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాత తేదీలతో లేఖలు రాశారని, కమిటీలు వేస్తున్నట్లు హడావుడి చేశారని విమర్శించారు. కేంద్రం నిర్వహించిన ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్ల ప్రస్తావనే రాలేదని సీఎం రేవంత్ అబద్ధాలు చెబితే, ఏపీ మంత్రి మాత్రం అక్కడ చర్చ జరిగిందని నిజం బయటపెట్టారని ఆయన ఎద్దేవా చేశారు.బనకచర్ల కంటే నల్లమల సాగర్ ప్రాజెక్ట్ తెలంగాణకు రెట్టింపు ప్రమాదకరమని (డబుల్ డేంజర్) ఆయన హెచ్చరించారు. ఢిల్లీ వేదికగా జరిగిన సమావేశాల్లో తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టి రేవంత్ రెడ్డి సంతకాలు చేసి వచ్చారని ఆరోపించారు.చంద్రబాబుకు గురుదక్షిణ? ఈ వ్యవహారమంతా చూస్తుంటే రేవంత్ రెడ్డి తన రాజకీయ గురువు చంద్రబాబు నాయుడుకు 'గురుదక్షిణ' చెల్లిస్తున్నట్లుగా ఉందని హరీష్ రావు ఘాటుగా విమర్శించారు. "కత్తి ఏపీదే కావచ్చు.. కానీ దాంతో తెలంగాణ ప్రయోజనాలను పొడిచేది మాత్రం మన ముఖ్యమంత్రే" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలు తమ నీటి వాటాల కోసం అప్రమత్తంగా ఉంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం కళ్లు మూసుకుని కూర్చుందని మండిపడ్డారు. నల్లమల సాగర్ నిర్మాణానికి చంద్రబాబు సూత్రధారి అయితే, రేవంత్ రెడ్డి పాత్రధారిగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

## జర్నలిస్టు సంఘాలతో

### సమావేశమవుతానన్న మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ :** అక్రిడిటేషన్‌ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు.డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రిపోర్టర్లతోపాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది.

## అసోంలో 11 మంది

## ఉగ్రవాదుల అరెస్ట్




**అస్సాం:** భారత ఈశాన్య రాష్ట్రాల్లో అలజడి సృష్టించి, శాంతిభద్రతలను అస్థిరపరచాలని చూస్తున్న అంతరా తీయ ఉగ్రవాద నెట్‌వర్క్ కుట్రను భద్రతా దళాలు అత్యంత చాకచక్యంగా తిప్పికొట్టాయి. అస్సాం, త్రిపుర రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు చేసేందుకు సిద్ధమైన 11 మంది జిహాదీలను స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేశారు. బంగ్లాదేశ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థలతో వీరికి ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.కేంద్ర నిఘా సంస్థలు అందించిన పక్కా సమాచారంతో అస్సాం మరియు త్రిపుర పోలీసులు సమన్వయంతో ఈ మెరుపు దాడి నిర్వహించారు. అస్సాంలోని బార్పేట, చిరాంగ్, దరంగ్ జిల్లాలతో పాటు త్రిపురలోని కీలక ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. పట్టుబడిన వారిలో కొత్తగా ఏర్పడిన 'ఇండియన్ ముజాహిదీన్–కె' సభ్యులు ఉన్నట్లు గువహతి పోలీస్ కమిషనర్ పార్థ సారథి మహంత ధృవీకరించారు. వీరి ప్రధాన లక్ష్యం ఈశాన్య ప్రాంతంలో తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం మరియు విచ్ఛిన్నకర శక్తుల ఆధిపత్యాన్ని నెలకొల్పడమేనని అధికారులు వెల్లడించారు.అరెస్టయిన వారిలో త్రిపురకు చెందిన 33 ఏళ్ల జాగీర్ మియా కీలక వ్యక్తిగా భావిస్తున్నారు. ఇతను జమాతుల్ ముజా హిదీన్ బంగ్లాదేశ్ అనుబంధ సంస్థ అయిన 'ఇమామ్ మహముదే కఫిలా'తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నాడు. అలాగే, అస్సాం విభాగం ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న నసీం ఉద్దీన్ అలియాస్ తమీమ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. వీరి నుంచి పెద్ద ఎత్తున జిహాదీ సాహిత్యం, ఇతర కీలక పత్రాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బంగ్లాదేశ్‌లోని హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు పనిచేస్తున్న ఈ బృందం, చాలా కాలంగా రహస్యంగా తమ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అరెస్టయిన వారిలో జునాబ్ అలీ, అఫ్రహీం హుస్సేన్, మిజానూర్ రెహమాన్ వంటి వ్యక్తులు వివిధ జిల్లాల్లో ఉగ్రవాద కార్యకలాపాలను సమన్వయం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం వీరిని రహస్య ప్రాంతంలో విచారిస్తున్న అధికారులు, ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎంతమంది ఉన్నారనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ భారీ ఆపరేషన్‌తో ఒక పెద్ద ప్రమాదం తప్పిందని, సరిహద్దు ప్రాంతాల్లో నిఘా మరింత కట్టుదిట్టం చేశామని భద్రతా వర్గాలు తెలిపాయి.

# ఫ్లెక్సీల చింపివేతపై మండిపడ్డ బీఆర్ఎస్ నాయకుడు మానిక్ యాదవ్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని హెచ్చరిక

**అమీన్‌పూర్ డిసెంబర్ 30 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని ఐలాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుడు మానిక్ యాదవ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పూర్ ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.?సంస్కృతి లేని రాజకీయం: “అమీన్‌పూర్ గడ్డపై ఫ్లెక్సీలు చించే హీనమైన సంస్కృతిని కొందరు మొదలుపెట్టారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చాలు, పనిగట్టుకుని వాటిని పాడు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం” అని మానిక్ యాదవ్ విమర్శించారు.?సహనాన్ని పరీక్షించవద్దు: ఇలాంటి చిల్లర పనులతో తమ సహనాన్ని పరీక్షించవద్దని ఆయన ప్రత్యర్థులను హెచ్చరించారు. రాజకీయ పద్ధతులను విడనాడి కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు.?తిప్పికొడతాం: “మేము కూడా అదే బాట పడితే.. మీ ఫ్లెక్సీలు కూడా ఈ ప్రాంతంలో మిగలవు. కానీ మాకు పద్ధతి, క్రమశిక్షణ ఉన్నాయి. మా ఓపికను బలహీనతగా తీసుకోవద్దు” అని హెచ్చరించారు.?ఎన్నికల్లో తేల్చుకుందాం: రాజకీయంగా



ఎదగాలనే ఆకాంక్ష ఉన్నవారు దొంగచాటుగా ఫ్లెక్సీలు చించరని,



ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలోకి వచ్చి, ఎన్నికల బరిలో నిలిచి తమ సత్తా నిరూపించుకోవాలని మానిక్ యాదవ్ సవాల్ విసిరారు.రాజకీయాలు అభివృద్ధిపై జరగాలే తప్ప, ఇలాంటి విద్రోహ చర్యలపై కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కుడలసంఘం 39వ శరణుమేళకు కుటుంబ సమేతంగా పాల్గొనాలి

**- పూజ్య శ్రీ డాక్టర్ గంగా మాతాజీ.**



**సదాశివపేట,డిసెంబర్,30,మెదక్ టుడే న్యూస్:** విశ్వగురు బసవన్న ఐక్య క్షేత్రం కూడల సంగంలో, జనవరి 12, 13,14, తేదీన39వ శరణుమేళ కార్యక్రమనికిఆహ్వానించడానికి విచ్చేసిన పూజ్య శ్రీ డాక్టర్ గంగా మాతాజీ మాట్లాడుతూ, కుడలసంగం లో జరిగే 39వ శరణుమేళ కార్యక్రమనికి కుటుంబ సమేతంగా పాల్గొని 3 రోజులు పాటు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరము సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ మాజీ ప్రధాన కార్యదర్శి అని శెట్టి జయప్రకాష్, మాతాజీ ని ఘనంగా సన్మానించారు,ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శి సుభాష్,జహీరాబాద్ తాలూకా అధ్యక్షులు ఆగూర్ శివరాజ్, యువజన నాయకులు అరుణ్ కుమార్, ఉదయ్ కౌలాస్,తెలంగాణ రాష్ట్ర రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షులు. శంకర్ పాటిల్, జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు.డా.శరణప్ప బలోడే, జిల్లా మహిళా నాయకురాలు పద్మజ, వినయ,నాగేష్ పాటిల్, సర్పంచ్ సరిత పాటిల్ పాల్గొన్నారు.

# పాఠశాలల మౌలిక సదుపాయాల పనులు మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలి

**- పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య..**

**సంగారెడ్డి,డిసెంబర్,30, మెదక్ టుడే న్యూస్:**

పాఠశాలలు,రెసిడెన్షియల్ స్కూల్ లలో చేపడుతున్న మౌలిక సదుపాయాల పనుల నువేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులనుఆదేశించారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం వంద శాతంగా ఉండాలని, వివిధ సబ్జెక్టులలో వెనకబడిన విద్యార్థులను ముందుగానే గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధతో బోధన చేపట్టాలని సూచించారు.పాఠశాలల్లో ఈజీఎస్ కింద మంజూరైన మరుగుదొడ్లన్నింటినీ వెంటనే గ్రౌండింగ్ చేయాలని, రెండు రోజుల్లో ఏజెన్సీలను గుర్తించి, రెండు నెలల లోపు అన్ని టాయిలెట్లు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పనులను పంచాయతీరాజ్ శాఖ మిషన్ మోడ్‌లో చేపట్టాలని, ఎప్పటికప్పుడు ఫాలప్ చేసి పూర్తి చేయించాల్సిన బాధ్యత ఎంఈఓలదని స్పష్టం చేశారు. వినియోగించిన నిధులకు సంబంధించి యూసీలను ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు.వినియోగంలో ఉన్న మరుగుదొడ్ల వివరాలను సంబంధిత పోర్టల్‌లో తప్పనిసరిగా అప్డేట్





చేయాలని, వినియోగంలో లేని మరుగుదొడ్లను మరమ్మత్తులు చేపట్టి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే స్కూల్ మెయింటెనెన్స్ గ్రాంట్, శానిటేషన్ గ్రాంట్‌లను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు.పి.ఎం.శ్రీ పాఠశాలల కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో, పారదర్శకంగా వినియోగించాలన్నారు.పి.ఎం.శ్రీ పాఠశాలల్లో హౌస్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ఎంఈఓలు వ్యక్తిగతంగా పర్యవేక్షణలో పాల్గొనాలని తెలిపారు. విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్స్, ఎక్స్‌పోజర్ విజిట్స్ నిర్వహించడంతో పాటు క్రీడా పరికరాల కొనుగోలు,క్రీడల నిర్వహణ వంటి అంశాలకు నిధులను సమర్థవంతంగా వినియోగించాలన్నారు.కేజీబీవీలు, టీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ పాఠశాలల్లో ఈజీఎస్ కింద చేపడుతున్న టాయిలెట్లు, కిచెన్ షెడ్లు, మరమ్మత్తుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎంఈఓలు తమ పరిధిలోని అన్ని పాఠశాలలను నిరంతరం సందర్శించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.ఎంఆర్ సెంటర్లకు ఒక ప్రొజెక్టర్, స్క్రీన్, స్పీకర్ యూనిట్ ను అందిస్తున్నామని, వాటితో మొదటగా రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రేరణాత్మక సినిమాలు ప్రదర్శించి స్ఫూర్తి కలిగించాలన్నారు. అనంతరం అన్ని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలల్లోనూఈ కార్యక్రమాన్ని విస్తరించాలని సూచించారు. ఇవే యూనిట్లను కాంప్లెక్స్ మీటింగ్స్, టీచర్ల ట్రైనింగ్స్‌కు కూడా వినియోగించుకో వచ్చన్నారు.ఈసందర్భంగా పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన 52 రోజుల ప్రత్యేక తరగతుల కార్యాచరణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు.ఈసమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీఓ జ్యోతి,డీఈఓ వెంకటేశ్వర్లు,ఎంఈఓలు, ఈడబ్ల్యూడీఐసీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, హెడ్‌మాస్టర్లు, సెక్టర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు

# తమ్ముడిని హత్య చేసిన అన్న



**పాపన్నపేట,డిసెంబర్,30, మెదక్ టుడే న్యూస్:**

భూమి రిజిస్ట్రేషన్ విషయంలో ఒకరు హత్యకు గురైన ఘటన మండల పరిధి బాచారం గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన చాకలి దశరథ్(36) కొన్నేళ్ల క్రితం తన అన్న ఆశయ్య వద్ద 7గుంటల భూమిని కొన్నాడు.ఆ భూమిని తన పేరు మీదికి చేయాలని దశరథ్ కోరుతున్నప్పటికీ ఆశయ్య జాప్యం చేస్తూ అదనంగా డబ్బు కావాలని డిమాండ్ చేస్తున్నాడు.ఈ విషయ లో పంచాయతీ జరిగిన నచ్చజెపిన ఆశయ్య భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు.ఇదే విషయంలో మళ్లీ సోమవారం రాత్రి దశరథ్ ఆశయ్యకు ఫోన్ చేసి భూమి తన పేరు మీదికి రిజిస్ట్రేషన్ చేయాలని అనడంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి తమ్ముడిపై కోపం పెంచుకున్న ఆశయ్య కత్తితో గ్రామ చౌరస్తా వద్ద దశరథ్ ను కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి.అడ్డుకోబోయిన దశరథ్ కుమారుడు సంగమేశ్వర్ కు సైతం గాయాలు కాగా గ్రామస్థులు గమనించి తీవ్ర గాయాలతో ఉన్న దశరథ్ ను, అతని కుమారుడు సంగమేశ్వర్ ను మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.అక్కడ వైద్యులు పరీక్షించి దశరథ్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# వడియారం నూతన సర్పంచ్ వార్డ్ సభ్యులు ప్రమాణ స్వీకారం

**చేగుంట డిసెంబర్ 30 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం వడియారం గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ని వార్డ్ సభ్యులను అందరిని స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో చిన్నారెడ్డి ఎంపిఓ ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. సర్పంచ్ సాయికుమార్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ వడియారం గ్రామ అభివృద్ధికి ముందుండాలి ప్రతి పనికి ప్రజల సహకారం ఉండాలి, నేను మీలో ఒకడిలా ఉంటాను.మన గ్రామని అభివృద్ధి చేసుకుందాం మండలంలోని ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేవరకు ఊరుకోను అన్నారు. ప్రజలు అందరూ నాకు సహకరించాలి, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి,ఎంపీ ఓ ప్రశాంత్, సెక్రటరీ విజయపాల్ రెడ్డి, సర్పంచ్ సాయికుమార్ గౌడ్,ఉప సర్పంచ్



నాగరాజు,వార్డు సభ్యులు మీర్ గయాసోద్దీన్,దప్పు స్వప్న, కూతురి కవిత, గొల్ల మంజుల గౌటే మంజుల మామిడ్ల భాగ్య, సబఅజామ్, శ్రావణ్ కుమార్, జనార్దన్ గౌడ్,పున్న వినయ్,



అనిల్ కుమార్,గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది

# తెల్లాపూర్‌లో జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయ ఏర్పాటుపై కుట్రలు మానుకోవాలి మాజీ ఉపసర్పంచ్ కృష్ణ డిమాండ్.



**పటాన్చెరు డిసెంబర్ 30 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాన్ని తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేయడంపై కొందరు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న కుట్రలను మానుకోవాలని తెల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ కృష్ణ తీవ్రంగా మండిపడ్డారు.

పేదల సౌకర్యార్థమే ఈ నిర్ణయం: నిరుపేదలు ఎక్కువగా నివసించే తెల్లాపూర్, కొల్లూరు వంటి ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువలో ఉండాలనే ఉద్దేశంతోనే సర్కిల్ కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారని ఆయన గుర్తు చేశారు. దీనిని తప్పుపట్టడం సరికాదన్నారు.

40 ఏళ్ల ఆధిపత్యం: గత 40 ఏళ్లుగా దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు పటాన్‌చెరులోనే కొనసాగుతున్నాయని, ఇప్పుడు ఒక్క కార్యాలయం తెల్లాపూర్‌కు మారగానే హడావిడి చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.కుట్రలు మానుకోవాలి: కార్యాలయాన్ని తిరిగి పటాన్‌చెరుకు తరలించాలంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్లు రాజకీయ ప్రేరేపితమైనవని, ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.ప్రజల అభివృద్ధి ముఖ్యం: అభివృద్ధిని వికేంద్రీకరించడం ద్వారా అన్ని ప్రాంతాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, దీనిని అడ్డుకోవాలని చూడటం ప్రజలకు ద్రోహం చేయడమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీటీసీ తూర్పు శ్రీనివాస్, మాజీ వార్డ్ మెంబర్ రవీందర్ మరియు ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు..

# మారుతి నగర్ కాలనీలో తుమ్మల పాండురంగా రెడ్డి పర్యటన సమస్యల పరిష్కారానికి హామీ.



**అమీన్‌పూర్ డిసెంబర్ 30 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ మారుతి నగర్ కాలనీలో మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి మంగళవారం ఉదయం పర్యటించారు. కాలనీలోని ప్రతి వీధిని సందర్శించి, స్థానికులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సమస్యల గుర్తింపు: కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, మరియు వీధి దీపాల వంటి మౌలిక వసతులపై స్థానికులు పాండురంగా రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణ స్పందన: కాలనీవాసుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన



పాండురంగా రెడ్డి, వీటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ మొదటి ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు.? అందుబాటులో ఉంటాం: అమీన్పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని ఏ కాలనీలో సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురా వాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు యూనుస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసు యాదవ్, శేఖర్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులూ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందడి





**పాపన్నపేట,డిసెంబర్,30,మెదక్ టుడే న్యూస్:** ఉదయం నుండి ఆలయాల్లో అధ్యాత్మిక సందడి నెలకొంది. మంగళవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మల్లంపేట హరిహర క్షేత్రంలో కొలువైన శ్రీ సీతారామ చంద్రస్వామి,పాపన్నపేట పాతూరు లో కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో దేవత మూర్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు శివ శ్రీ శివ శాస్త్రి,విశ్వనాథ శర్మ లు విశేష పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార పాలక పూజ అనంతరం స్వామి వారిని ఉత్తర ద్వారం గుండా భక్తులు దర్శించుకున్నారు. ఈసందర్బంగా పాపన్నపేట మాజీ ఎంపీపీ చందన ప్రశాంత్ రెడ్డి,మల్లంపేట సర్పంచ్ పుట్టి పద్మ రమేష్,పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీరంగూడ గుట్టపై వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు ఉత్తర ద్వార దర్శనం కోసం పోటెత్తిన భక్తులు.







**అమీన్పూర్ డిసెంబర్ 30 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ గుట్టపైన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బీరంగూడ శ్రీ వేంకటేశ్వర స్వామి (గుట్టపై) ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.వైభవంగా ఉత్తర ద్వార దర్శనం:ఏకాదశి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. అత్యంత పవిత్రమైన ఉత్తర ద్వార దర్శనం (వైకుంఠ ద్వారం) ద్వారా భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. గోవింద నామస్మరణతో బీరంగూడ గుట్ట పరిసరాలు మారుమోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నానాజీ మీడియాతో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి విశిష్టతను వివరించారు:"ఏడాది పొడవునా వచ్చే 24 ఏకాదశుల్లో వైకుంఠ ఏకాదశి అత్యంత పవిత్రమైనది. ముక్కోటి దేవతలు వైకుంఠానికి తరలివచ్చే రోజు కావడంతో దీనిని ముక్కోటి ఏకాదశి అంటారు. ఈరోజు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగి, మోక్షం సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. భక్తులందరికీ ఆ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు లభించాలని కోరుకుంటూ ప్రత్యేక అర్చనలు చేశాము."భక్తుల రద్దీ దృష్ట్యా స్థానిక పోలీసులు మరియు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ నిరంతరాయంగా కొనసాగింది.

# నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**- పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్**



**పాపన్నపేట,డిసెంబర్,30, మెదక్ టుడే న్యూస్:** నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలే తప్ప విషాదాన్ని మిగిలిచేలా చేసుకోవద్దని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సూచించారు, ఎవరైనా తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో కేసుల్లో ఇరుక్కున్న యువత భవిష్యత్తు నాశనమయ్యే అవకాశం ఉందాని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎవరైనా డ్రంక్ అండ్ డ్రైవ్ కు పాల్పడ వద్దని ఆయన సూచించారు. మద్యం మత్తులో ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని, దీంతో కుటుంబం వీధిన పడాల్సి వస్తుందని ఆయన సూచించారు. అలాగే తాగి ం దిగొద్దన్నారు, ఎవరైనా మద్యం సేవిస్తే డ్రైవింగ్ కు డ్రైవర్ వినియోగించు కోవాలని సూచించారు. డిసెంబర్ 31 తో పాటు జనవరి ఒకటిని ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు

# చేగుంటలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

**చేగుంట డిసెంబర్ 30 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండల కేంద్రం లోని శ్రీ వెంకటేశ్వరా స్వామి ఆలయం లో నేడు వైకుంఠ ఏకాదశి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆలయమును పూలమాలలతో సర్వంగా సుందరంగా అలంకరించినారు. ఈ వేడుకలకు భక్తులు ఉదయం ఐదు గంటల నుండి అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు. ఆలయ పూజారి వాసుదేవ శర్మ, భక్తులకొరకు ప్రత్యేక పూజలు నిర్వహించినారు. స్వామి వారి దర్శనానికి చేగుంట గ్రామ ప్రజలతో పాటు చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారి మాట్లాడుతూ, వైకుంఠ ఏకాదశి హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన ఏకాదశుల్లో ఒకటి. ఈ రోజు శ్రీ మహావిష్ణువు నిద్ర నుంచి మేల్కొంటారని, వైకుంఠ ద్వారాలు తెరుచుకుంటాయని భక్తుల విశ్వాసం. ఈ రోజు ఉత్తర





ద్వార దర్శనం, స్వర్ణరథోత్సవం ఉంటుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకొని ఉంటాయని, వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు తెల్లవారుజామునే వేచి ఉంటారు అని వైకుంఠ ఏకాదశి రోజున మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడని పురాణ కథనం అని తెలిపారు. అలాగే ఈ రోజు ఉపవాసం, పూజ, జాగరణ చేస్తే మోక్షం లేరు పాప విమోచనం పొంది వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం అన్నారు.

## అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్ ముదిరాజ్



**?అమీన్పూర్, డిసెంబర్ 30: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ గారిని మంగళవారం అమీన్పూర్ మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్ ముదిరాజ్ మరియు పటేల్ గూడ మాజీ సర్పంచ్ ఈర్ల నితీష్ శ్రీకాంత్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు.?ఈ సందర్భంగా వారు కమిషనర్ గారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాబోయే నూతన సంవత్సర (2026) శుభాకాంక్షలు ముందుగానే తెలియజేశారు. అమీన్పూర్ పరిధిలోని పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు.?ఈ కార్యక్రమంలో వారితో పాటు నాయకులు గోవింద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

# యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగుతుంది రైతులు ఆందోళన చెందవద్దు.జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.

**సంగారెడ్డి,డిసెంబర్,30,మెదక్ టుడే న్యూస్:**

జిల్లాలో యూరియా ఎరువుల సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.జిల్లాలోని అన్ని పిఎసిఎస్ సహకార సంఘాలు, అగ్రో కేంద్రాలు, హెచ్ ఏ సి ఏ, డీసీఎంఎస్, కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా సరిపడి నంత స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో మొత్తం 4,766 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, ఇందులోసహకార సంఘాల వద్ద 444 మెట్రిక్ టన్నులు,ప్రైవేట్ డీలర్ల వద్ద502 మెట్రిక్ టన్నులు,మార్క్ఫెడ్ బఫర్ స్టాక్ 3,819 మెట్రిక్ టన్నులు ఉన్నాయని పేర్కొన్నారు.యూరియా సరఫరా విడతల వారీగాకొనసాగించబడుతున్నందున రైతులు ఎటువంటి



ఆందోళనకు, అపోహలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యూరియా పంపి ణీ సక్రమంగా జరిగేలా అందరు ఏ డి ఎ లు, ఏవోలు, ఏవోలు అందుబాటులో ఉండి నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు వెల్లడించారు.రైతులందరూ ప్రశాంతతతో అవసరమైన మేరకుయూరియా కొనుగోలు చేయాలని కోరారు. అనవసరంగా అధికంగా కొనుగోలు చేయకుండా సహకరించాలని సూచించారు.యూరియా సరఫరా, పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తూ, రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్రీ అండ్ డ్రగీస్ట్ కార్యదర్శిని సన్మానించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రజలకు ప్రవీణ్ కుమార్



**చేగుంట డిసెంబర్ 30 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రంలో చేగుంట పట్టణానికి చెందిన తోడుపు నూరి రాజు తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్రీ అండ్ డ్రగీస్ట్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనందునా వారిని శాలువాతో సన్మానించిన చేగుంట మాజీ మార్కెట్ చైర్మన్ రజనకు ప్రవీణ్ కుమార్ వారు మాట్లాడుతూ చేగుంట నుండి మీరు ఎన్నికైనందుకు మాకు సంతోషకరంగా ఉంది.గ్రామ ప్రజలందరూ ఆనందించవలసిన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తో పాటు, భాగ్యరాజ్, రాజు, సిద్ధిరాములు, మేకల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు

# ప్రచురణార్థం నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగదు

**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**-మంత్రిని కలిసిన తెలంగాణ జర్నలిస్టు సంఘాల జేఏసీ**






**హైదరాబాద్,డిసెంబర్,30, మెదక్ టుడే న్యూస్:(స్టేట్ బ్యూరో)**

తెలంగాణలో గతంలో ఇచ్చిన మీడియా అక్రెడిటేషన్ కార్డుల కంటే అధికంగానే ఇస్తామని, నిజమైన జర్నలిస్టులకు తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని రాష్ట్ర సమాచార, పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అక్రిడిటేషన్ల జీవో 252 విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏదైనా పొరపాట్లు ఉంటే త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశమై సవరిస్తామని అన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(టీజేఏ జేఏసీ) నాయకులు మంత్రి పొంగులేటిని కలిసి జీవో 252 సవరణతో పాటు జర్నలిస్టుల ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అతి త్వరలో అన్ని జర్నలిస్టు సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని,అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మరో జీవో తెస్తామని అన్నారు. డెస్క్ లో పనిచేసే వారికి, ఫీల్డ్ లో పనిచేసే జర్నలిస్టులకు అనేక సంక్షేమ పథకాలను అంచెలంచెలుగా అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సమాచార పౌరసంబధాల శాఖ స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంక లకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 252 మార్గదర్శకాలలోని అభ్యంతరాలను నోటిఫికేషన్కు ముందు సవరించాలని, చిన్న పత్రికలు, కేబుల్ ఛానెళ్లతో పాటు ఎంపానల్మెంట్ కాకుండా ఉన్న ఇతర పత్రికలకు సంబంధించిన ప్రతి జర్నలిస్టుకు వారి సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని వారు కోరారు.రెండు కార్డుల వ్యవస్థకు బదులుగా, డెస్క్ జర్నలిస్టులకు కూడా జర్నలిస్టుల మాదిరిగానే ఒకే అక్రిడిటేషన్ కార్డు వ్యవస్థను కొనసాగించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అయిందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు 15 సంవత్సరాల సీనియారిటీ నిబంధన అసంబద్ధమని, ఈ నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించాలని, ఇందుకు కోసం వెంటనే ఆయా విభాగాలకు అధికారిక ఆదేశాలు జారీ చేయాలని కోరారు.జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు బీమా సౌకర్యం కల్పించాలని,60 సంవత్సరాలు నిండిన జర్నలిస్టులందరికీ నెలకు రూ. పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, జర్నలిస్టులకు దేశవ్యాప్తంగా రైల్వే ఫ్రీ పాసులు కల్పించాలని,అదేవిధంగా జర్నలిస్టుల వాహనాలకు టోల్ గేట్ ఫీజు నుంచి మినహాయింపు సదుపాయం కల్పించాలని వారు మంత్రిని కోరారు. మంత్రిని, కమీషనర్ ను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్లు మామిడి సోమయ్య (టీడబ్ల్యూజేఎఫ్), కే.కోటేశ్వర్ రావు(ఏడబ్ల్యూజేఏ), అనంచిన్ని వెంకటేశ్వరరావు(టీజే ఎస్ఎస్), పులిపలుపుల ఆనందం(ఐఎఫ్ డబ్ల్యూజే), రావికంటి శ్రీనివాస్(డబ్ల్యూజేఐ), గౌటి రామకృష్ణ, రాణా ప్రతాప్, కీర్తి సంతోష్ రాజు తదితరులున్నారు.

# వడియారం సర్పంచ్ ప్రమాణ స్వీకారోత్సవంలో చేగుంట మజీ మార్కెట్ కమిటీ చైర్మన్

**చేగుంట డిసెంబర్ 30 మెదక్ టుడే న్యూస్**



చేగుంట మండలం వడియారం గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సాయి కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించబడినది. సర్పంచ్ ని చేగుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రజనకు ప్రవీణ్ కుమార్ శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పుడు ఎన్నికైన వాళ్లంతా గ్రామాన్ని అభివృద్ధిలో ముందు ఉంచాలి నేను కూడా సర్పంచిగా చేశాను మీకు ఏమైనా సలహాలు కావాలంటే కూడా నన్ను అడగండి నేను చెప్తాను మన ఊరిని అన్ని విధాలుగా డెవలప్మెంట్ చేసుకుందాం . మీ అందరికీ నేను అన్ని విధాలుగా సహకరిస్తాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో మజీ చైర్మన్ తో పాటు సర్పంచ్, ఉప సర్పంచ్, వెంకట్ గౌడ్, నాదీమ్,నాగార్జున,తదితరులు పాల్గొనడం జరిగినది

# ఏం డౌట్ వద్దు మళ్లీ వచ్చేది డీఎంకే పాలనే



**చెన్నై:** వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని, అదే సమయంలో రెండోమారు అధికారంలోకి రానున్న ద్రావిడ తరహా పాలన మహిళాభ్యుదయానికే అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్) పేర్కొన్నారు. తిరుప్పూరు జిల్లా పల్లడం మైదానంలో 'వెల్లుమ్ తమిళగ పెణ్‌గళ్' పేరుతో డీఎంకే మహిళా విభాగం పడమటి మం డల మహానాడు ఆ విభాగం అధ్యక్షురాలు, ఎంపీ కనిమొళి అధ్యక్షతన జరిగింది. ఈ మహానాడులో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ ఈ మహానాడుకు హాజరైన మహిళలను చూస్తుంటే మరోమారు డీఎంకేకు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారనే భావన తనకు కలుగుతోందన్నారు. మహానాడును ఇంత గొప్పగా ఏర్పాట్లు చేపట్టిన తన సోదరి కనిమొళి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. రానున్నది మహిళా సంక్షేమ పాలన కనుకనే ప్రస్తుతం డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో తయారీ చేసే బాధ్యత కూడా కనిమొళికి అప్పగించానని తెలిపారు. రాష్ట్రంలో పెరియార్, అన్నాదురై వంటి మహాపురుషులు మహిళాభ్యుదయం కోసమే తీవ్రంగా పాటుపడ్డారని గుర్తు చేశారు. డీఎంకేకు ముందున్న జస్టిస్ పార్టీ తొలి సమావేశం 1914లో జరిగిందని, ఆ సమావేశంలో తొలిసారిగా ఓ మహిళ పాల్గొందని, ఆమే పేరే అలమేలు మంగతాయరమ్మాళ్ అని స్టాలిన్ తెలి పారు. 1949లో డీఎంకే ఆవిర్భావంలో సత్యవాణి ముత్తు వంటి మహిళా ప్రముఖులు కీలక పాత్ర పోషించారన్నారు. 1956లో అన్నాదురై పార్టీలో మహిళలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారని, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఆ విభాగానికి మరింత జవసత్వాలు కలిగించారని, అప్పటి నుండి డీఎంకేలో ఈ మహిళా విభాగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. చదువులకు దూరంగా వంటింటికే పరిమితమైన మహిళలకు విముక్తి కలిగించింది డీఎంకే మాత్రమేనని, ప్రస్తుతం అధికారంలో ఉన్న తమ ప్రభుత్వం మహిళలకు అమ లు చేస్తున్న పథకాలతో వారిలో ఆర్థిక స్థోమత పెరిగిందన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత కూడా తమ పార్టీకే దక్కుతుందన్నారు. ఇక కేంద్రంలోని బీజేపీ పాలకులు ఎల్లప్పుడూ మహిళా వ్యతిరేక ధోరణినే ప్రదర్శిస్తుంటారని, ఆ కారణంగా పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు అమలుకు నోచుకోకుం డా అణచివేసిందని స్టాలిన్ ఆరోపించారు. ఈ మహానాడులో మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, సామినాధన్, ముత్తుసామి, కయల్‌విళి సెల్వరాజ్, ఎంపీలు తిరుచ్చి శివా, ఎ.రాజా, అందియూరు సెల్వరాజ్, మాజీ మంత్రి పొన్ముడి, సెంథిల్‌బాలాజీ, పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి, మహిళా విభాగం కార్యదర్శి హెలెన్ డేవిడ్‌సన్ తదితరులు పాల్గొన్నారు. కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్, నామక్కల్, కరూర్, నీలగిరి జిల్లాలకు చెందిన 35 నియోజకవర్గాల పరిధిలోని డీఎంకే మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు వేలాదిమంది ఈ మహానాడులో పాల్గొన్నారు.

# ఖలీదా జియా మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బీఎన్‌పీ చీఫ్ ఖలీదా జియా మృతిపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఖలీదా జియా మరణంపై విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి, బంగ్లాదేశ్ ప్రజలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఖలీదా జియా లేనిలోటును ధైర్యంతో అధిగమించే శక్తిసామర్థ్యాలను ఆమె కుటుంబానికి ఇవ్వాలని ఎక్స్ వేదికగా ప్రధాని దేవున్ని ప్రార్థించారు. బంగ్లా తొలి మహిళా ప్రధాని తన మాతృభూమి అభివృద్ధి కోసం, భారత్- బంగ్లా మధ్య సంబంధాల కోసం ఆమె చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని ప్రధాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2015లో ఖలీదా జియాను కలిసిన నాటి ఫొటోలను మోదీ ట్వీట్?కు జత చేశారు."ఖలీదా జియా మృతి చెందారని తెలిసి నేను చాలా బాధపడ్డాను. ఆమె కుటుంబానికి, బంగ్లాదేశ్ ప్రజలందరికీ మా ప్రగాఢ సానుభూతి. ఈ నష్టాన్ని భరించే శక్తిని దేవుడు ఆమె కుటుంబానికి ప్రసాదించాలని కోరుకు ంటున్నా. బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఆ దేశ అభివృద్ధికి, రెండు దేశాల సంబంధాల బలోపేతానికి ఆమె చేసిన కృషి ఎల్లప్పుడూ గుర్తుండిపోతుంది. 2015లో ఢాకాలో ఆమెతో జరిగిన ఆత్మీయ సమావేశం ఇప్పటికీ గుర్తుంది. ఆమె దూరదృష్టి, వారసత్వం రెండు దేశాల సంబంధాలకు భవిష్యత్తులో కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని ఆశిస్తున్నాం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి"

# జీవో 252లో కొన్ని సవరణలు చేయండి






**హైదరాబాద్,డిసెంబర్,30, మెదక్ టుడే న్యూస్**

జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో, కొత్త మార్గదర్శకాలతో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 252లో కొన్ని సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కోరింది. మంగళవారం నాడు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార మరియు పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జీవో పై చర్చించడంతో పాటు వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన తమ సంఘం ముఖ్యుల సమావేశం, 252జీవో ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, జర్నలిస్టుల నుండి వ్యక్తం అవుతున్న అభ్యంతరాలు, జీవో లో లోటుపాట్లపై చర్చించి, కొన్ని సవరణలు అవసరమనే అభిప్రాయానికి వచ్చినట్లు మంత్రితో తెలిపారు. గతంలో అక్రెడిటేషన్ కార్డులతో డెస్క్ జర్నలిస్టులందరికీ కాకుండా కొందరికి మాత్రమే న్యాయం జరిగేదని, ప్రస్తుతం అలా కాకుండా బస్ పాస్ లతో సహా ప్రభుత్వం కల్పించే ప్రతి సంక్షేమ పథకం రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులనే తేడా లేకుండా, ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి డెస్క్ జర్నలిస్టుకు వర్తింపజేసేలా జీవో లో సవరించాలని ఆయన కోరారు. కేబుల్ టీవీ ఛానెల్స్ కు సంబంధించి, జీవో లో పేర్కొన్న అస్పష్టతను సరిచేయాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు మండలానికి ఒకటి కాకుండా, సదరు మండలంలో ప్రధాన డేట్ లైన్ లను గుర్తించి, వాటి ప్రకారం అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసేందుకు జీవో ను సవరించాలని కోరారు. చిన్న పత్రికలకు సర్క్యూలేషన్ ఆధారంగా జిల్లాల్లో కూడా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. ప్రధాన పత్రికలు, శాటిలైట్ న్యూస్ ఛానెల్స్ కు కార్డుల కుదింపు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు, వీడియో జర్నలిస్టులకు, కెమెరా జర్నలిస్టులకు వారి కార్యాలయాల సిఫారసుల మేరకు అందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్రంలో ఉర్దూ అధికార భాషా కనక, ఇతర భాషల సర్క్యూలేషన్ లతో, గ్రేడింగ్ లతో వాటిని పోల్చకుండా, ఉర్దూ పత్రికలు సర్క్యూలెట్ అవుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక కేటగిరి క్రింద జిల్లా, మండల స్థాయిల్లో ఉర్దూ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేలా జీవో లో పొందుపర్చాలని కోరారు. వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులు పొందడానికి, జీవో లో పేర్కొన్న వృత్తి అనుభవాన్ని కొంత తగ్గిస్తూ సవరించాలని మంత్రిని ఆయన కోరారు. టీయూడబ్ల్యూజే అభ్యర్థనపై మంత్రి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, త్వరలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి, ఏమైనా లోటుపాట్లుంటే సరిచేసుకుందామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్లూరి రాములు, రాష్ట్ర కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వి.యాదగిరి, రాష్ట్ర కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, ఎం.డి.గౌస్, హెచ్.యూ.జె అధ్యక్షుడు శంకర్ గౌడ్, రాష్ట్ర చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ తదితరులు ఉన్నారు.

**టీయూడబ్ల్యూజే సూచనలను పరిశీలిస్తాం**

జీవో 252పై తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం లిఖిత పూర్వకంగా చేసిన సూచనలను పరిశీలిస్తామని, మంగళవారం నాడు సచివాలయంలో తనను కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత సమావేశాన్ని నిర్వహించి జర్నలిస్టు సంఘాల అభిప్రాయాలు స్వీకరిస్తామన్నారు.

# లోయలో పడిన బస్సు- ఏడుగురు మృతి





**ఉత్తరాఖండ్ :** ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. భికియాసైన్-వినాయక్ రోడ్డులో ద్వారహత్ నుంచి రామ్‌నగర్‌కు ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సిబ్బంది ఘటనాస్థలిలో సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్, కండక్టర్ సురక్షితంగా ఉన్నట్లు సమాచారం.ప్రమాదం సమయంలో బస్సులో మొత్తం 19 మంది ప్రయాణికులు ఉన్నారు. మరణించిన వారిలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. దాదాపు 12 మంది తీవ్రంగా గాయపడినట్లు అధికారులు చెబుతున్నారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బస్సు ప్రమాదంపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామీ సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందించారు. ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు."భికియాసైన్ నుంచి అల్మోరాలోని రామ్‌నగర్‌కు వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురికావడం విచారకరం. గాయపడిన క్షతగాత్రులను జిల్లా యంత్రాంగం సమీపంలోని ఆస్పత్రులకు తరలించింది. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించారు. ప్రమాదం గురించి, సహాయక చర్యలు గురించి నేను అధికారులతో నిరంతరం మాట్లాడుతున్నాను. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను"

# 2026 బంగ్లాదేశ్ ఎన్నికలు భారత్‌కు ఎందుకు అత్యంత కీలకం

**బంగ్లాదేశ్ :** అల్లర్లు, హత్యలు, ఆందోళనలతో అట్టుడుకున్న బంగ్లాదేశ్‌లో 2026 ఫిబ్రవరిలో పార్లమెంటరీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికలు దక్షిణాసియాకే కాకుండా సరిహద్దు దేశం భారత్‌కు వ్యూహాత్మకంగా అత్యంత కీలకం. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంలో భారత వ్యతిరేక శక్తులు పెట్రేగిపోతున్న వేళ ఆ దేశంలో జరగనున్న ఎన్నికలు ఇరు దేశాల మధ్య బంధాన్ని మళ్లీ పునరావృతం చేస్తాయా బీఎన్‌పీ అగ్రనేత తారిక్ రెహమాన్ రాక భారత్‌కు ప్రయోజనమా లేక తారిక్ తల్లి ప్రధానిగా ఉన్నప్పటి వైరం పునరావృతం అవుతుందా ఇన్నాళ్లు సరిహద్దులో వ్యూహాత్మక భాగస్వామిగా ఉన్న బంగ్లాదేశ్ ఎన్నికల తర్వాత పక్కలో బల్లెంలా తయారవడానికి అవకాశాలు ఏ మేరకు ఉన్నాయి ఈ ఎన్నికలు ఎలా జరగాలని భారత్ కోరుకుంటోంది ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా ఎన్నికులు జరిగితే జరిగే పరిణామాలు ఏంటి భారత్‌కు జరిగే నష్టమేంటిగత 15 ఏళ్లపాటు అధికారంలో ఉన్న షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోవడం, ఆమె పార్టీ అవామీ లీగ్‌ను ఎన్నికలకు దూరం చేయడం, ఇదే సమయంలో, 17 ఏళ్ల సుదీర్ఘ ప్రవాసం తర్వాత బీఎన్‌పీ అగ్రనేత తారిక్ రెహమాన్ బంగ్లాదేశ్‌కు రావడం, మరోవైపు ఆ దేశంలో హిందువులు సహా మైనారిటీల భద్రతపై ఆందోళనలు వ్యక్తం కావడం, ఢాకాలో భారత వ్యతిరేక శక్తులు రెచ్చిపోతుండటం, ఇదే సమయంలో ఇండియాపై అవాకుచవాకులు పేలడం, ఇన్ని పరిణామాల నేపథ్యంలో మరో రెండు నెలల్లో జరగనున్న బంగ్లాదేశ్ ఎన్నికలు భారత్ కోణంలో ప్రాధాన్యతను సంతరించుకున్నా యి.భారత్ భయం ఇదే2026 ఎన్నికల్లో బంగ్లాదేశ్‌లో ఎవరు గెలుస్తారన్న దానికంటే, ఎలా విజయం సాధిస్తారనే అంశాన్ని భారత్ నిశితంగా పరిశీలిస్తోంది. ఒకవేళ ప్రజల మద్దతు ఉన్న పార్టీని పక్కన పెట్టి, వివాదాస్పదంగా ఎన్నికలు జరిగితే, కొత్త ప్రభుత్వానికి ప్రజల్లో పూర్తిస్థాయి మద్దతు ఉండదు. అటువంటి బలహీనమైన ప్రభుత్వం ప్రజా నిరసనలకు, మిలిటరీ జోక్యానికి లేదా చైనా వంటి ఇతర దేశాల ఒత్తిడికి తలొగ్గే అవకాశం ఉంటుందని భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. రాజకీయ అస్థిరతను ఆసరాగా చేసుకుని ఇస్లామిక్ అతివాద శక్తులు బలపడే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదే జరిగితే సరిహద్దు భద్రతపై దీని ప్రభావం తప్పకుండా ఉంటుంది. ఈ అంశాలు మన దేశ భద్రతా ప్రయోజనాలకు నేరుగా ముప్పుగా మారే అవకాశముందని భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రశాంత ఎన్నికలే భారత్ ఆకాంక్ష బంగ్లాదేశ్‌లో జరుగుతున్న తాజా పరిణామాలపై భారత్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసింది. తారిక్ రెహమాన్ బంగ్లాదేశ్‌కు తిరిగి రావడంపై భారత్ నిర్దిష్టమైన వైఖరిని కలిగి ఉంది. బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛాయుత ఎన్నికలకు తమ మద్దతు ఉంటుందని ఇప్పటికే స్పష్టం చేసింది. ఆ దేశంలో ఎన్నికల పరిణామాలను తాము ఇదే దృక్పథంతో చూస్తామని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌లో హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు వంటి మైనారిటీలపై అతివాద శక్తులు దాడి చేయడంపై ఆందోళన వ్యక్తం చేసింది. యూనస్ తాత్కాలిక ప్రభుత్వంలో మైనారిటీలపై 2,900కు పైగా దాడులు, హత్యలు, భూముల ఆక్రమణలు వంటి దుశ్చర్యలు జరిగాయని పేర్కొంది. ఇలాంటి ఘటనలను మీడియా అతిశయోక్తులుగా గానీ, సాధారణ రాజకీయ హింసగా గానీ కొట్టిపారేయలేమని అభిప్రాయపడింది.

# బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యక్తి హత్య
## కాల్చి చంపిన సహోద్యోగి



**బంగ్లాదేశ్ :** పొరుగుదేశం బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులు ఆగడం లేదు. తాజాగా మరో హిందూ వ్యక్తి హత్యకు గురయ్యాడు. మైమెన్‌సింగ్ జిల్లాలోని ఓ వస్త్ర కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా పనిచే స్తున్న హిందూ కార్మికుడిని సహోద్యోగి కాల్చి చంపాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం 6:45 గంటల సమయంలో మెహ్రాబారి ప్రాంతంలో ఉన్న లాబిబ్ గ్రూప్ ఫ్యాక్టరీ అయిన సుల్తానా స్వెటర్స్ లిమిటెడ్‌లో చోటు చేసుకుంది.బాధితుడిని ఫ్యాక్టరీలో అన్సార్ సభ్యుడిగా పనిచేస్తున్న బజేంద్ర బిశ్వాస్ (42)గా గుర్తించారు. నిందితుడు నోమన్ మియా (29) కూడా అదే యూనిట్‌లో అన్సార్ సభ్యుడిగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భద్రతా విధుల్లో ఉన్న సమయంలో ప్రమాదవశాత్తూ ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బుల్లెట్ గాయమైన బజేంద్రను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.బంగ్లాదేశ్‌లో హిందూ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం రెండు వారాల్లో ఇది మూడో ఘటన కావడం గమనార్హం. డిసెంబర్ 18న భాలుకాలో హిందూ వ్యక్తి దీపు చంద్ర దాస్‌ను ఓ గుంపు కొట్టి చంపిన విషయం తెలిసిందే. అంతకుముందు, ఓ హిందూ వ్యక్తి కూడా హత్యకు గురయ్యాడు. దాడులతో బంగ్లాదేశ్‌లోని హిందువుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

# దేశ రాజధాని గగనతలంపై సుదర్శన చక్ర

**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ లో భద్రతకు సంబంధించి కేంద్రంలోని మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం మొత్తం రూ.5,181 కోట్లతో స్వదేశీ సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ ను కొనుగోలు చేయడానికి అనుమతించినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఈ మేరకు జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 'సుదర్శన చక్ర' ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ కింద ఢిల్లీలోని ముఖ్యమైన వీఐపీ–89 జోన్‌లో ఈ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నట్టు ఆ కథనం తెలిపింది.డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ దేశ రాజధాని చుట్టూ 30 కి.మీ. పరిధిలోని గగనతలంలో ఎటువంటి ముప్పునైనా నిరోధించగలదని సదరు వర్గాలు తెలిపాయి. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో డ్రోన్ల వంటి ఆయుధాల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో మోదీ సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేలా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధాలను కొనుగోలుచేయడానికి రక్షణ శాఖ సోమవారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఈ గగనతల రక్షణ వ్యవస్థ కొనుగోలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది ఆగస్టు



15 ప్రసంగంలో గగనతల రక్షణ వ్యవస్థ గురించి ప్రకటించారు. 'సుదర్శన్ చక్ర' పేరుతో కీలక ప్రాంతాలను వైమానిక దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల కవచం, ప్రతిదాడి వ్యవస్థలను మోహరించనున్నట్లు తెలిపారు. దేశంలోని వ్యూహాత్మక, పౌర, జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల భద్రతే దీని లక్ష్యం. ఇందులో భాగంగా శత్రువులు ప్రయోగించే క్షిపణులు, యుద్ధ విమానాలను ముందుగానే గుర్తించి, కూల్చివేసే వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. అలాగే, సైబర్ దాడులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా ఈ వ్యవస్థలో అనుసంధానిస్తారు.డీఆర్డీవో, సైన్యం, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేయడానికి కేంద్రం ఇప్పటికే సన్నాహకాలు ప్రారంభించింది. ఢిల్లీలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత గగనతల భద్రతను పటిష్టం చేయాలని భారత్ నిర్ణయించింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులకు దాయాది రగిలిపోయింది. సరిహద్దుల్లోని భారత సైనిక, వైమానిక స్థావరాలపై దాడులకు ప్రయత్నించగా.. వాటిని సైన్యం సమర్థవంతంగా అడ్డుకుంది. ఎస్–400 వంటి గగనతల రక్షణ వ్యవస్థలను భారత్ వినియోగించింది. అంతేకాదు, పాక్‌పై ఎదురుదాడి చేసి, దాని మౌలిక వసతులు, సైనిక స్థావరాలపై విరుచుకుపడింది. పాక్ నూర్ ఖాన్ ఎయిర్ బేస్ సహా కీలకమైన వ్యవస్థలను ధ్వంసం చేసింది.

# బడ్జెట్‌లోపే తేల్చాలి సీఎం మార్పుపై కర్ణాటక మంత్రి

**బెంగళూరు:** కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశంపై ఆ రాష్ట్ర హోం మంత్రి జి.పరమేశ్వర మంగళవారంనాడు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. నాయకత్వం అంశంపై పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా వచ్చే ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సన్నాహకాలకు ముందే ఆ పని చేయాలని అన్నారు. నాయకత్వాన్ని మార్చాలా వద్దా అనేది కాంగ్రెస్ అధిష్టానమే నిర్ణయిస్తుందని మంగళవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.'ఫిబ్రవరిలో బడ్జెట్ ప్రిపరేషన్ మొదలవుతుంది. అందుకు సుమారు నెలరోజులు పడుతుంది. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగానే బడ్జెట్ రూపకల్పన అనేది ఉంటుంది. ఒకవేళ నాయకత్వ మార్పుపై పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకోవాలనుకుంటే బడ్జెట్‌కు ముందే నిర్ణయం తీసుకోవాల్సి ఉటుంది' అని మీడియా అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు. ఇటీవల జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో కొందరు సీఎంగా పరమేశ్వరకు పగ్గాలు అప్పగించాలని డిమాండ్ చేయడంపై అడిగినప్పుడు, తనపై అభిమానంతోనే అలా అని ఉండవచ్చని, వాళ్లను అలా మాట్లాడవద్దని తానెలా చెప్పగలనని పరమేశ్వర ప్రశ్నించారు. ఎవరిని సీఎం చేయాలి? ఎప్పుడు చేయాలి? నాయకత్వం మార్పు చేపట్టాలా? వద్దా? అనే అంశాలన్నీ పార్టీ అధిష్టానమే నిర్ణయిస్తుందన్నారు.కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా గతంలో పనిచేసిన పరమేశ్వర గత నెలలో తాను కూడా ముఖ్యమంత్రి రేసులో ఉన్నానని చెప్పారు. దళిత సామాజిక వర్గానికి చెందిన నేతను సీఎం చేయాలని కర్ణాటక కాంగ్రెస్‌లో ఒక వర్గం డిమాండ్ చేస్తోంది. ఆ డిమాండ్‌ను అధిష్టానం పరిగణనలోకి తీసుకుంటే పార్టీ సీనియర్ దళిత నేతల్లో పరమేశ్వర కూడా ఉన్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..